క్లుప్తంగా

శరవేగంగా భూముల రీ సర్వే



రీసర్వే నిర్వహిస్తున్న అధికారులు

లింగసముద్రం: మండలంలో భూముల రీసర్వే శరవేగంగా జరుగుతుందని తహసీల్దార్ సుధాకరరావు తెలిపారు. మండలంలోని మొగిలిచర్లలో డ్రోన్ ద్వారా భూముల సర్వే చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ భూముల రీ సర్వేతో రైతులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. దాదాపు వందేళ్ల తరువాత భూముల సర్వేను ప్రభుత్వం ఎంతో ప్రతిష్మాకంగా నిర్వహిస్తుందన్నారు. రీ సర్వేను రైతులంతా సద్వినియోగం చేసుకోవాలన్నారు. వీఆర్‌ఓ వేణు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

తెప్పోత్సవానికి ముస్తాబు



తెప్పోత్సవానికి కోనేరుకు రంగులు అద్దుతున్న కార్మికులు

ఉలవపాడు: ఉలవపాడులో వేంచేసి ఉన్న వేణుగోపాలస్వామి తెప్పోత్సవానికి ముస్తాబైంది. ఏటా కనుమ నాడు గ్రామ నడిబొడ్డున ఉన్న కోనేరులో తెప్పోత్సవం కన్నులపండువగా నిర్వహిస్తారు. తెప్పోత్సవాన్ని తిలకించేందుకు ప్రకాశం, నెల్లూరు జిల్లాల నుంచి భారీగా భక్తులు తరలివస్తారు. ఈ ఏడాది 16వ తేదీ సాయంత్రం 5 గంటలకు తెప్పోత్సవం దేవాదయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.

కబడ్డీ పోటీలు ప్రారంభం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే బుర్రా

కనిగిరి రూరల్: మండలంలోని చింతలపాలెంలో కబడ్డీ పోటీలను ఎమ్మెల్యే, టీటీడీ పాలక మండలి సభ్యుడు బుర్రా మధుసూదన్ యాదవ్ ప్రారంభించారు. తొలుత జట్లను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సంక్రాంతి మన రైతుల పండుగని, ప్రజలంతా సుఖ సంతోషాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. చింతలపాలెం కౌన్సిలర్లు రమణబోయిన శ్రీనివాసులు, పాపసాని కృష్ణారెడ్డి, పాపసాని సుబ్బారెడ్డి, చంద్రమౌలిరెడ్డి, ఎన్ రత్తమ్మ, కొలగాని సుబ్బయ్య ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్, సాని కొమ్ము రంగనాయకులరెడ్డి, డాక్టర్ మురళీ, నక్కా రామకృష్ణ పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల పంపిణీ

అద్దంకి రూరల్: సంక్రాంతి పండుగ సందర్భంగా వాసవి క్లబ్ డిస్ట్రిక్ గవర్నర్ ఉమ అన్నపూర్ణ విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. శుక్రవారం స్థానిక గీతా మందిరంలో వాసవి క్లబ్, వనిత క్లబ్ ఆధ్వర్యంలో సంక్రాంతి ముగ్గుల పోటీలు, భగవద్గీత పోటీలు నిర్వహించారు. ముందస్తు సంక్రాంతి వేడుకల్లో భాగంగా చిన్నారులకు బోగి పండ్లు పోశారు. కార్యక్రమంలో పుట్టంరాజు శ్రీరామ చంద్రమూర్తి, శైలజ, ఆత్మకూరి ఆంజనేయులు, శిరీష, ఉడత్తు ఆదినారాయణ, విజయలక్ష్మీ, పాల్గొన్నారు.

హోరాహోరీగా ఎడ్ల బలప్రదర్శన

పర్చూరు: అన్నంబొట్లవారిపాలెం గ్రామంలో సంక్రాంతి సంబరాలలో భాగంగా గొట్టిపాటి హనుమంతరావు మెమోరియల్ ఆధ్వర్యంలో 35వ జాతీయస్థాయి బండలాగు ఎడ్ల బలప్రదర్శన పోటీలు ఉత్సాహభరితంగా జరుగుతున్నాయి. పోటీల్లో పాల్గొన్న ఎడ్ల జతలు సువ్వానేనా అన్నట్లు పోటీ పడుతున్నాయి. శుక్రవారం రాత్రి పాలపళ్ల విభాగానికి బండలాగు పోటీలను నిర్వహించగా, మొత్తం 21 కోడెలు పాల్గొంటున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కోడెలు పది నిమిషాల్లో ఐదు క్వింటాళ్ల బరువుఉన్న బండను లాగాయి. ప్రస్తుతం పోటీలు కొనసాగుతున్నాయి. 14వ తేది శనివారం సాయంత్రం 2 పళ్లవిభాగంలో పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు గోరంట్ల భాస్కరరావు తెలిపారు.

పండుగకు ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు

చీరాల అర్బన్: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని దూర ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికుల కోసం చీరాల ఆర్టీసీ డిపో నుంచి హైద్రాబాద్‌కు ప్రత్యేక సర్వీసులను నడుపుతున్నట్లు డిపో మేనేజర్ జే.శ్యామల శుక్రవారం తెలిపారు. చీరాలకు హైద్రాబాద్ నుంచి గత మూడు రోజులుగా పది సర్వీసులను నడిపామన్నారు. అలానే సంక్రాంతి పండుగ సెలవుల అనంతరం హైద్రాబాద్‌కు చీరాల నుంచి ప్రత్యేక సర్వీసులను నడుపుతున్నట్లు తెలిపారు. ప్రయాణికులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలి

పొన్నలూరు: రాష్ట్ర ప్రభుత్వం ఆశయాలకు అనుగుణంగా గ్రామాల అభివృద్ధికి ప్రతి అధికారి కృషి చేయాలని ఎంపీపీ కొండాబత్తిన మాధవరావు పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా శాఖల వారిగా జరుగుతున్న అభివృద్ధి పనులను అధికారులు వివరించారు. జలజీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికీ కుళాయి నిర్మించి నీటి వసతిని కల్పిస్తున్నారన్నారు. 832 డ్వాక్రా గ్రూపులకు వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా మూడవ విడత రుణమాఫీ నగదు రూ. 7.52 కోట్లును ఈ నెల 27న వారి ఖాతాలకు జమ చేస్తున్నారన్నారు. ప్రధానంగా మండలంలో సాగు



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ మాధవరావు

నీటి చెరువుల అభివృద్ధికి రూ. 8 కోట్లతో అంచనాలు తయారు చేసి పంపించామన్నారు. ఎంపీపీ స్కూల్‌లో ఉపాధ్యాయుల పనితీరు సక్రమంగా లేదని, అలాగే గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించి విద్యార్థుల, గ్రామస్తుల ప్రయాణ ఇబ్బందులు తొలగించాలని సర్పంచ్ మన్నెం పద్మవతి సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. తిమ్మపాలెం, శివన్నపాలెం గ్రామాల మధ్యలో ఉన్న విద్యుత్ లైన్ సక్రమంగా లేదని వెంటనే విద్యుత్ తీగలను సరి చేసి రెండు గ్రామాల ప్రజలకు కరెంట్ కష్టాలు తీర్చాలని ఎంపీటీసీ యానాది కోరారు. కొన్ని శాఖల అధికారులు సమావేశానికి డుమ్మా కొట్టారు. ఎంపీడీఓ రత్నజ్యోతి, సీడీపీఓ మాధవీలత, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

అనుమతి లేకుండా వెంచర్లు వేయరాదు

కనిగిరి: అనుమతి లేకుండా వెంచర్ల వేస్తున్న వారిపై చట్ట ప్రకారం చర్యలు తప్పవని మున్సిపల్ కమీషనర్ డీవీఎస్ నారాయణరావు అన్నారు. శుక్రవారం ఆయన పాతూరు, మంగళమాన్యం, బొగ్గుబావి తదితర ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన బొగ్గుబావి వెనుక ఉన్న సర్వే నంబర్ 656, 657,658లో, శంకవరం వద్ద సర్వే నంబర్ 368లో అనుమతులు లేకుండా వేస్తున్న వెంచర్లను గుర్తించారు. వెంటనే రెవెన్యూ, ప్లానింగ్ సిబ్బందితో కలిసి హద్దురాళ్లు తొలగింపచేశారు. వెంచర్ల యజమానులకు నోటీసులు జారీ చేశారు. అనుమతి లేకుండా వెంచర్ల వేయరాదని ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని, వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. సంబంధిత విభాగాలతో, రియల్టర్లతో సమావేశం ఏర్పాటు చేసి పలు ప్రధానకూడలి ప్రదేశాల్లో, అనుమతులు లేని వెం



వెంచర్లను పరిశీలిస్తున్న మున్సిపాల్ డీవీఎస్ నారాయణరావు

చర్ల వివరాలతో సర్వే నంబర్లతో ఫ్లెక్సీలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనుమతి లేని వెంచర్లలో ప్లాట్లు కొని ఇబ్బందులు పడవద్దని తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ కేశవలు, సచివాలయ ప్లానింగ్, శానిటరీ, రెవెన్యూ సెక్రటరీలు పాల్గొన్నారు.

భువనగిరి, బైరెడ్డిలకు సన్మానం



వెంకటయ్య, తిరుపతిరెడ్డిలను సన్మానిస్తున్న నేతలు

సీఎస్‌పురం: వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు భువనగిరి వెంకటయ్య, పార్టీ నూతనంగా ఏర్పాటు చేసిన సచివాలయాల మండల కన్వీనర్ బైరెడ్డి తిరుపతిరెడ్డిలను వైఎస్సార్ సీపీ నాయకులు శుక్రవారం సన్మానించారు. ఎంపీపీ మూడమంచు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ మైనారిటీసెల్ రాష్ట్ర కార్యదర్శి షేక్ బుజ్జి అధ్యక్షతన స్థానిక మండల పరిషత్ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. వైస్ ఎంపీపీ భూమిరెడ్డి ప్రభంజన వెంకటరెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా సంయుక్త కార్యదర్శి పాలకొల్లు వెంకటేశ్వరరెడ్డి, మండల యూత్ అధ్యక్షుడు ఎం అటేలయ్య, వీరభద్ర వీరాంజనేయ స్వామి ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ మూరం మొరార్జి, సర్పంచ్‌ల సంఘం జిల్లా కార్యదర్శి బొట్ల చిరంజీవి, నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా గంధ మహోత్సవం

పామూరు: మండలంలోని మోపాడు బంగ్లా కాలనీలో హజరత్‌మహబూబ్ సుభాని గంధ మహోత్సవం శుక్రవారం గంధ పంపిణీతో ముగిసింది. ఈ సందర్భంగా దర్గాలో హిందూ, ముస్లింలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేకప్రార్థనలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. గంధ మహోత్సవం సందర్భంగా దర్గాను ప్రత్యేక విద్యుద్దీపాలంకరణతో శోభాయమానంగా తీర్చిదిద్దారు. జెడ్పీటీసీ చప్పిడి సుబ్బయ్య, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగసాని హుసేన్‌రెడ్డి, చప్పిడి అజయ్ పాల్గొన్నారు.

పౌష్టికాహారం వినియోగించుకోండి

మర్రిపూడి: గ్రామీణ ప్రాంతాల్లోని ఐసీడీఎస్ అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పౌష్టికాహారాన్ని మండలంలోని అర్హులంతా సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సివిల్ సప్లైయిస్ అధికారి, మర్రిపూడి మండల ప్రత్యేకాధికారి ఉదయభాస్కర్ పేర్కొన్నారు. స్థానిక అంగన్‌వాడీ కేంద్రాన్ని శుక్రవారం తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం అందించే మాతా పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకుని, మాతృ, శిశు మరణాలను తగ్గించాలన్నారు. రావిళ్లవారిపాలెం, చిమటలో నిర్మిస్తున్న జగనన్న కాలనీలను పరిశీలించారు. తహసీల్దార్ జి. విజయలక్ష్మి, ఎంపీడీఓ ఎస్. సుదీపా, హౌసింగ్ ఏఈ ఆర్ వెంకటేశ్వర్లు, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ ఎస్‌కే షాజిద, ఏపీఎం బాబూరావు,



మర్రిపూడిలో అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న దృశ్యం

హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీను, ఏపీఓ వెంకట్రావు పాల్గొన్నారు.

పార్టీ విజయానికి సమన్వయంతో పనిచేయండి

పామూరు: సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు వైఎస్సార్ సీపీ బలోపేతంకోసం, వచ్చే ఎన్నికల్లో పార్టీని విజయపథంలో నిడిపేందుకు సమన్వయంతో పనిచేయాలని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగసాని హుసేన్‌రెడ్డి అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం గృహ సారథుల నియామకంపై సచివాలయ కన్వీనర్లు, పార్టీ ముఖ్య నాయకులు, ఎంపీటీసీ, సర్పంచ్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హుసేన్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీ కోసం అంకితభావంతో పనిచేసే వారిని గుర్తించి ప్రతి వలంటీర్ పరిధిలో ఒక పురుషుడు, ఒక మహిళను గృహ సారథులుగా నియమించాలని, ఈ ప్రక్రియ 17వ తేదీ కల్లా పూర్తిచేయాలన్నారు. ప్రభుత్వం, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అర్హతే ప్రామాణికంగా పార్టీ, కులం, మతాలకు అతీతంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందిస్తున్నారన్నారు. సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు ప్రభుత్వం పేదలకు ఇస్తున్న పథకాలను వివరించి, టీడీపీ నాయ



మాట్లాడుతున్న పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి హుసేన్‌రెడ్డి

కుల మోసపూరిత మాటలు తిప్పికొట్టేలా ప్రజలను చైతన్యవంతులు చేయాలన్నారు. సమావేశంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు సెంట్రింగ్‌చాంద్‌బాషా, మాజీ వైస్ ఎంపీపీ పువ్వాడి రాంబాబు, యాదాల వెంకటసాయికిరణ్, కో ఆప్షన్ నాయబ్‌రసూల్, గట్లా విజయభాస్కర్‌రెడ్డి, కన్వీనర్ల మండల అధ్యక్షుడు ఖాదర్‌బాషా, పార్టీ మహిళావిభాగం మండల అధ్యక్షురాలు జమీలాబేగం, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

గర్భిణుల వివరాలు ఆన్‌లైన్ చేయాలి



మర్లపాడు సచివాలయాన్ని పరిశీలిస్తున్న రాజ్యలక్ష్మి

టంగుటూరు: గర్భిణుల నమోదు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి రాజ్యలక్ష్మి అన్నారు. మర్లపాడు సచివాలయాన్ని శుక్రవారం సందర్శించి మాట్లాడారు. ఫ్యామిలీ ఫిజిషియన్ వివరాలు వెల్లడించారు. ఉప వైద్యాధికారి మాధవీలత, టంగుటూరు వైద్యాధికారి ఆశోక్, సీహెచ్‌ఓ వెంకటేశ్వర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ

సింగరాయకొండ: కేంద్ర ప్రభుత్వం పీఎం శ్రీ పథకం కింద మంజూరైన ప్రభుత్వ పాఠశాలల్లో అదనపు వసతుల కల్పనకు నిధులు వస్తాయని పీఎంశ్రీ పథకం రాష్ట్ర పరిశీలకులు, ఆర్‌జేడీ వీఎస్ సుబ్బారావు అన్నారు. స్థానిక బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలను శుక్రవారం తనిఖీ చేశారు. మండలంలో గురుకుల పాఠశాల, పాకల హెచ్‌పీ ప్రాథమిక పాఠశాల ఈ పథకం కింద నమోదయ్యాయన్నారు. ఎంఈఓ బి. శివన్నారాయణ, ప్రిన్సిపాల్ ఉమాదేవి, సీఆర్పీ వంశీ పాల్గొన్నారు.



సింగరాయకొండ-గురుకుల పాఠశాలలో రికార్డులు పరిశీలిస్తున్న ఆర్జేడీ సుబ్బారావు

12 గ్రామాల్లో రెవెన్యూ సభలు



అర్జీలు స్వీకరిస్తున్న తహశీల్దార్ మహ్మద్ హుసేన్

ఉలవపాడు: మండల పరిధిలో అసైన్‌మెంట్ భూముల మంజూరు కోసం 12 గ్రామాల్లో శుక్రవారం రెవెన్యూ సభలు నిర్వహించారు. ఆత్మకూరు, మన్నేటికోట, కరేడు, రామాయపట్నం, వీరేపల్లి, చాగల్లు, చాకిచర్ల, పెద పట్టపుపాలెం, భీమవరం, బద్దిపూడి, ఉలవపాడు, కృష్ణాపురం గ్రామాల్లో గ్రామసభలు జరిగాయి. తహసీల్దార్ మహ్మద్ హుసేన్ ఉలవపాడు సభలో పాల్గొని అర్జీలు స్వీకరించారు. సర్వేయర్ శ్రీనివాసులు, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్‌ను పరిశీలించిన ఆర్జేడీ

ఉలవపాడు: మండల పరిధిలోని వీరేపల్లి మోడల్ స్కూల్‌ను గుంటూరు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి, పీఎంయస్‌ఆర్‌ఐ పాఠశాలల ప్రత్యేకాధికారి వీఎస్ సుబ్బారావు శుక్రవారం పరిశీలించారు. కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా 14500 పాఠశాలలను ఎంపిక చేసి వాటిలో అన్ని వసతులు కల్పించి అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. అందులో వీరేపల్లి మోడల్ స్కూల్ కూడా ఎంపికైంది. వీటిని పీఎంఎస్ ఆర్ఐ పాఠశాలలుగా నిర్ణయించారు. అందులో భాగంగా స్కూల్‌నుపరిశీలించారు. పాఠశాలలోని మరుగుదొడ్లు, సైన్స్ ప్రయోగశాల, గ్రంథాలయంతో పాఠశాల ఆవరణను పరిశీలించారు. ఇతర మౌలిక సదుపాయాలు ఎలా ఉన్నాయి. ప్రస్తుతం



మోడల్‌స్కూల్‌ను పరిశీలించిన ఆర్‌జేడీ

ఇంకా ఏం అవసరమో గుర్తించాలని తెలిపారు. కనిగిరి మోడల్‌స్కూల్ ప్రిన్సిపల్ శ్రీనివాసులు ఉన్నారు.

రాష్ట్ర స్థాయి ఎడ్ల పోటీలకు సర్వం సిద్ధం

గుండ్లసముద్రం (మర్రిపూడి): సంక్రాంతి పురస్కరించుకుని మండలంలోని గుండ్లసముద్రం గ్రామంలోని రైతుభరోసా కేంద్రం ఆవరణలో ఈ నెల 15 నుంచి ప్రారంభం కానున్న రాష్ట్రస్థాయి ఎడ్ల బల ప్రదర్శనకు సర్వం సిద్ధం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. శుక్రవారం ఎంపీపీల సంఘం జిల్లా అధ్యక్షులు, మర్రిపూడి ఎంపీపీ వాకా వెంకటరెడ్డి, స్పేస్ విజన్ గ్రూప్స్ అధినేత తూమాటి వెంకట నర్సింహారెడ్డి, వాకా సుబ్బారెడ్డి, బారికేట్ల నిర్మాణం , డోజర్ సహాయంతో గ్రౌండ్ చదును చేసే పనులను పరిశీలించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా మర్రిపూడి ఎస్ఐ పి. అంకమ్మరావు బందోబస్త్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.



భూమి చదును పనులను పరిశీలిస్తున్న ఎంపీపీ వాకా వెంకటరెడ్డి

ఈ క్రాప్ నమోదు తప్పనిసరి

హనుమంతునిపాడు: రబీలో పంటల సాగు చేసిన ప్రతి రైతు ఈ క్రాప్‌లో నమోదు చేసుకోవాలని వ్యవసాయాధికారి సంపత్‌కుమార్ షన్నారు. స్థానిక రైతు భరోసా కేంద్రంలో శుక్రవారం వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటలను ఈ క్రాప్ చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ వీఏఏలు కాశయ్య, రబ్బాని, నవ్య, భారతీ, కొండలు తదితులున్నారు. ఈ క్రాప్ బుకింగ్ వలన రైతుకు కలిగే ప్రయోజనాలను గురించి వివరించారు.

మంచి నీటి పైపు లైన్‌కు మరమ్మతులు

టంగుటూరు: మేజర్ పంచాయతీ మంచి నీటి పైపు లైను రైల్వే మూడో లైను నిర్మాణంలో భాగంగా పాలేరు నది వద్ద పూర్తిగా దెబ్బతిందని ఈఓఆర్డీ నర్రా జగదీష్ బాబు తెలిపారు. శుక్రువారం నూతన పైపు లైన్ల పనులను ఆయన పరిశీలించారు. గ్రామ ప్రజలకు ఇబ్బంది కలగకుండా గత మూడు రోజుల నుంచి నూతన పైపు లైన్లు పూనరుద్దరణ చేసి గ్రామ ప్రజలకు మంచి నీరు అందిస్తామని తెలిపారు.



నూతన పైపు లైన్లు పరిశీలిస్తున్న ఈఓఆర్డీ

ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు

కందుకూరు అర్బన్: నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. తెలుగు వారి సంప్రదాయమైన భోగి, సంక్రాంతి, కనుమ పండుగలు కుటుంబసభ్యులతో కలసి సంతోషంగా జరుపుకోవాలని తెలియజేశారు. ప్రజలు సుఖ సౌఖ్యాలతో, భోగభాగ్యాలతో, పాడి పంటలతో ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు.

కనిగిరి: నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే, టీటీడీ పాలకమండలి సభ్యుడు బుర్రా మధుసూదన్ యాదవ్‌సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఇంటా ఆనంద సిరులు వెల్లివిరియాన్నారు.

కందుకూరు: తెలుగు వారి పెద్ద పండుగ సంక్రాంతి పండుగను ప్రతి ఒక్కరూ కుటుంబసభ్యులతో కలిసి ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు తెలియజేశారు. భోగి, సంక్రాంతి, కనుమ పండుగలతో ప్రతి ఇంట్లో సంతోషాలు వెల్లివిరియాలని, బంధుమిత్రులతో కలిసి ఉత్సాహంగా పండుగ జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు.

సంప్రదాయాలకు ప్రతీక ముగ్గులు



చిన్నారులు వేసిన ముగ్గుల కొలువు



ముగ్గుల పోటీలను పర్యవేక్షిస్తున్న ఐద్వా నాయకులు

పామూరు: తెలుగు సంస్కృతి సంప్రదాయాలకు ముగ్గులు ప్రతీక అని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు సయ్యద్ షమ్మి అన్నారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా మండలంలోని ఇనిమెర్లలో శుక్రవారం ఐద్వా, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ముగ్గులపోటీలు, మ్యూజికల్ ఛైర్స్‌పోటీలు నిర్వహించారు. ఈసందర్భంగా ఏర్పాటుచేసి బహుమతి ప్రదానోత్సవంలో ఆమె మాట్లాడుతూ కుల మతాలకు అతీతంగా అందరు ఒకచోట చేరి పండుగ సంబరాలను ఉల్లాసంగా నిర్వహించుకునేందుకే పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. ఐద్వా మండల అధ్యక్షురాలు భానుమతి, మదారమ్మ, ఖాదరున్నీసా, మస్తాన్‌బీ, జయరావు, తిరుపతయ్య, రామారావు, శంకర్, గ్రామ మహిళలు పాల్గొన్నారు.

ఘనంగా సంక్రాంతి సంబరాలు

కందుకూరు అర్బన్: కందుకూరు మున్సిపాలిటీ 16వ వార్డు సిపాయిపాలెం, గుర్రంవారిపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో ముందస్తు సంక్రాంతి పండుగ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అర్బన్ ప్రాజెక్ట్ సీడీపీఓ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో భోగిమంటలు వేసి చిన్నారులను ఉత్సాహపరిచారు. సంక్రాంతి పండుగ సాంప్రదాయల్లో భాగంగా ముగ్గులు వేశారు. చిన్నారులు వేసిన వేషధారణలు పలువురిని ఆకట్టుకున్నాయి. చిన్నారుల బొమ్మల కొలువు, హరిదాసు, గొబ్బెమ్మలు, గాలిపటాలు ఆకర్షణగా నిలిచాయి.

సచివాలయాలు తనిఖీ

గుడ్లూరు: మండలంలోని మోచర్ల, పోట్లూరు గ్రామ సచివాలయాలను ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి శుక్రవారం తనిఖీ చేశారు. సచివాలయాలలోని రికార్డులు, రిజిష్టర్లు, బయోమెట్రిక్ హాజరును పరిశీలించారు. సచివాలయాల పరిధిలో సమస్యలపై వచ్చిన దరఖాస్తులు పరిశీలించారు. దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరించాలని కార్యదర్శులకు సూచించారు. సచివాలయ ఉద్యోగులు బాధ్యతగా పనిచేయాలన్నారు. సంక్షేమపథకాలుఅర్హులందరికీ అందేలా చూడాలన్నారు.ప్రతిఒక్కరూసమయపాలనపాటించాలన్నారు.

నేడు 'సంఘం శరణం గచ్ఛామి' నాటక ప్రదర్శన

టంగుటూరు: ఆలకూరపాడులో పూలే, అంబేద్కర్ విగ్రహ కమిటీ ఆధ్వర్యంలో సంఘం శరణం గచ్ఛామి నాటకాన్ని నిర్వహిస్తున్నట్లు సభ్యులు తెలిపారు. రాజ్యాంగ అంబేద్కర్ పోరాట జీవిత చరిత్రపై హైదరబాదు బ్లూ వింగ్సు ఫౌండేషన్ వారి సహకారంతో, అభ్యుదయ ఆర్ట్సు అకాడమీ వారిచే నిర్వహిస్తారన్నారు. ముఖ్య అతిథిగా అంబేద్కర్ వాది మూర్తి, తదితరులు పాల్గొంటారన్నారు.

62 మందికి వైద్య పరీక్షలు

గుడ్లూరు: ఇంటింటా వైద్యం..ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా చేవూరులో వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ మారుతీరావు 62 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారి గృహాలకు వెళ్లి సూచనలు చేశారు. వైద్య సిబ్బంది, ఆశాకార్యకర్తలు, 104 సిబ్బంది పాల్గొన్నారు.

నేడు క్రికెట్ పోటీలు

పీసీపల్లి: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో సీఎస్ఎస్ఆర్ యూత్ క్రికెట్ పోటీలను శనివారం రెడ్డి కార్పొరేషన్ చైర్మన్ చింతలచెర్వు సత్యనారాయణ ప్రారంభించనున్నారు. పోటీల్లో విజేతలకు రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.8 వేల బహుమతులు అందించనున్నారు.

నేటి నుంచి క్రికెట్ టోర్నమెంట్

పీసీపల్లి: మండల పరిధిలోని పెదయిర్లపాడులో శనివారం నుంచి పెదయిర్లపాడు యూత్ ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయిలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. విజేతలకు రూ.10 వేలు, రూ.7 వేలు, రూ.5 వేలు అందజేస్తామన్నారు. పోటీల్లో పాల్గొనే జట్లు రూ.500 ఎంట్రీ ఫీజు చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 8185015612, 7893743548 నంబర్లను సంప్రదించాలని కోరారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

లింగసముద్రం: యాదవ యూత్ ఫోర్స్ ఆధ్వర్యంలో స్థానిక కేఆర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో గోకుల కృష్ణా మెగా క్రికెట్ టోర్నమెంట్‌ను ఎంపీపీ పెన్నా కృష్ణయ్య శుక్రవారం ఉదయం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ సంక్రాంతిని పురస్కరించుకొని క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించడం శుభపరిణామమన్నారు. అనంతరం ఎంపీపీ బ్యాటింగ్ చేసి క్రికెట్ పోటీలను ప్రారంభించారు.



బ్యాటింగ్ చేస్తున్న ఎంపీపీ పెన్నా క్రిష్ణయ్య

15న పరుగు పందెం పోటీలు

గిద్దలూరు రూరల్: శింగంపల్లెలో పోలేరమ్మ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 15న పరుగు పందెం పోటీలను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. 18 సంవత్సరాల నుంచి 30 సంవత్సరాల మధ్య వయస్సు గల వారు అర్హులని.. పూర్తి వివరాల కోసం 7993706798, సెల్‌ను సంప్రదించాల్సిందిగా కోరారు.

ముగ్గురు జూదరుల అరెస్ట్

సింగరాయకొండ: మండలంలోని ఊళ్లపాలెంలో కోడి పందేలు ఆడుతున్న ముగ్గురిని శుక్రవారం అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 5,232 రూపాయలు నగదు, 2 కోళ్ల స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై షేక్ ఫిరోజ్‌ఫాతిమా తెలిపారు. కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరచనున్నట్లు వివరించారు.